# సాఫ్ట్‌వేర్ ‘ఇతి’హాస్యం [2]

~ అద్దంకి అనంతరామయ్య



**సీరియల్:** సాఫ్ట్‌వేర్ ‘ఇతి’హాస్యం [2]

**రచన:** అద్దంకి అనంతరామయ్య

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: జనవరి 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=961

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**

Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [2]

(దీని ముందు భాగం)

అజయ్ పుట్టి పెరిగింది అద్దంకిలోనే. ఇంటర్ విజయవాడలో, ఇంజనీరింగ్ ఒంగోలులో చేసి, ఇప్పుడు హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నాడు. సెల్ ఫోను ఉంటే బ్యాటరీ ఉంచటం ఎంత తప్పనిసరో, ఉద్యోగంతో పాటు ప్రియురాలు ఉండటం కూడా అంతే తప్పనిసరి. ఒక్కటే తేడా, బ్యాటరీకి ఛార్జ్ చేస్తే సెల్ ఫోను పనిచేస్తుంది. ప్రియురాలిని ఛార్జ్ చేస్తే ప్రియురాలే సంతోషిస్తుంది. ప్రియుడికి మిగిలేది మనస్సుకి తృప్తి, జేబుకి చిల్లి .

నిషా, అజయ్ కి హుషారెక్కించే అమ్మాయి. వీళ్ళ ప్రేమకి, వర్షానికి చిన్న సంబంధం ఉన్నది. అప్పుడు అజయ్ ఇంజనీరింగ్ కాలేజి చేరిన మొదటి రోజులు. కాలేజీ చేరిన వారానికి అనుకోకుండా అజయ్ కి నిషాతో పరిచయం అయ్యింది. ఆ రోజు అజయ్ కి ఎప్పటికీ గుర్తుండి పోయే రోజు. అసలే శ్రావణ మాసం, ఆంగ్లంలో చెప్పాలంటే ఆగస్టు నెల. ఊరంతా పెళ్ళిళ్ళు, రాష్ట్రమంతా వర్షాలు.

అజయ్ తన క్రొత్త బండి మీద కాలేజీకి వస్తున్నాడు. కాలేజీ గేటు దగ్గరకి రాగానే వర్షం జోరందుకుంది. బండి వేగం పెంచాడు. ఆ వర్షంలో నిషా తడుస్తూ, నడుస్తూ ఉన్నది. అజయ్ బండి నిషా దగ్గర ఆపి, software for uploadఎక్కమన్నట్టు సైగ చేశాడు. "పర్వాలేదు" అంటూ నిషా నడకలో వేగాన్ని పెంచింది. " చాలా దూరం ఉంది, పర్లేదు ఎక్కు" అని అజయ్ ఇంకొంచెం గట్టిగా అడిగాడు. మారు మాట్లాడకుండా బండి ఎక్కి కూర్చున్నది. క్షణాల్లో ఇద్దరూ కాలేజీలో ఉన్నారు. "ఏ బ్రాంచ్?" అని అడిగాడు అజయ్ తన తలకున్న హెల్మెట్ తీసి, తలను చేతితో తుడుచుకుంటూ. "ఇ.సి.ఈ సార్" అని చెప్పింది తన ముఖాన ఉన్న ముసుగుని తీస్తూ. 'సార్' అనటంతోనే అజయ్ కి విషయం అర్థం అయ్యింది . నిషా తనని సీనియర్ అనుకుంటున్నది అని.

"ఏ ఊరు?" అని అడిగాడు . తనని చూడగానే అజయ్ కి గుండెలో టిమటిమలు మొదలు అయ్యాయి. తను ఏ ఊరిపేరు చెప్పిందో కూడా తన చెవులకు వినపడలేదు. ఆకాశంలో విహరిస్తున్న దేవకన్యలలో నుంచి ఒక సుందరి మెరుపుకి భయపడి కిందకి జారిపడిందేమో అన్నంత అందంగా తోచింది . "కనీసం థాంక్స్ కుడా చెప్పలేదు, ఏ బడిలో చదువుకున్నావు? ఇవేమీ నేర్పలేదా?" అన్నాడు అజయ్ కోపాన్ని నటిస్తూ. "సారీ సార్ సీనియర్ అనే భయంతో చెప్పలేదు, థాంక్స్" అని

నవ్వింది. “సీనియర్లంతా రాక్షసులు కాదు, స్టాఫ్ అంతా దేవుళ్ళు కాదు! సీనియర్స్ లో కుడా మంచోళ్ళు ఉంటారు. నా పేరు అజయ్” అని చెయ్యి చాపాడు. నిషా కూడా తన పేరు చెప్పి ఇచ్చింది, చెయ్యి. ఎవరి తరగతులకు వారు వెళ్ళిపోయారు.

అజయ్ తన ఇతర స్నేహితుల ద్వారా నిషా గురించి వివరాలు సేకరించాడు. హాస్టల్లో ఉంటుంది , హార్లిక్స్ తాగుతుంది, హై హీల్స్ వేస్తుంది, హార్డ్ వర్క్ చేస్తుంది, హచ్ సిమ్ వాడుతుంది, హిందీ కూడా మాట్లాడుతుంది, హంబుల్ నెస్ ఎక్కువ , హెల్పింగ్ నేచర్ తక్కువ. ఆ తరువాత రోజున కాలేజీ లో అజయ్ నిషా కోసం వెతుకుంటూ ఉండగా దూరాన నిషా ఎవరితోనో మాట్లాడుతూ కనిపించటంతో ఆ వైపుగా వెళ్ళాడు. తనని నిషా కూడా చూసింది. “అజయ్ సార్” అని పిలిచింది. అజయ్ నిషా దగ్గరకు వెళ్ళాడు. అజయ్ ని చూడగానే అక్కడ ఉన్న వాళ్ళ ముఖం రంగు మారిపోయింది. తను సీనియర్ అని అంతా భయపడి పోతున్నారనుకున్నాడు అజయ్.

“వీడేనా నీకు తెలిసిన సీనియర్” అన్నాడు ఆ గుంపులో ఒకడు. “వీళ్ళు నన్ను ర్యాగింగ్ చేస్తున్నారు సార్” అని అజయ్ కి ఫిర్యాదు చేసింది నిషా. కుడితిలో పడ్డ ఎలుక లాగ అయ్యాడు అజయ్. సాఫ్ట్ వేర్ పరి భాషలో చెప్పాలంటే వైరస్సున్న కంప్యూటర్ కు గుచ్చుకున్న కొత్త పెన్ డ్రైవ్ లాగా అయ్యాడు. “ఏ బ్రాంచ్ రా నువ్వు?” అని అడగడటంతో “కంప్యూటర్స్ సార్” అన్నాడు అజయ్, భయంగా సీనియర్ ని, జాలిగా నిషాని చూస్తూ. “చేరి వారం కూడా కాలేదు, అప్పుడే ర్యాగింగ్ మొదలు పెట్టావారా? వీడి సంగతి మేము చూస్తాం” అని సీనియర్ చెప్పటంతో నిషా తన స్నేహితులతో వెళ్ళిపోయింది.

ఆ రోజు సీనియర్లంతా కలిసి అజయ్ ని ఆడుకోని, ఆరేశారు. తర్వాత రోజు కాలేజీ క్యాంటీన్ లో టిఫిన్ చేస్తున్నాడు. దూరంగా నిషా కూడా టిఫిన్ చేస్తుండటం గమనించాడు. తన దగ్గరకి వెళ్లి కూర్చున్నాడు. “సారీ! ఏదో సరదాకి ఆట పట్టించటానికి సీనియర్ అని చెప్పాను” అన్నాడు అజయ్. నిషా ఏమి మాట్లాడలేదు. “ఐయామ్ రియల్లీ సారీ!” అన్నాడు. “ఇట్స్ ఓకే , నిన్ను బాగా ఆడుకున్నారా?” అని నిషా అడిగింది. అవునన్నట్టు అజయ్ తలూపాడు . “మరి సీనియర్ అని చెప్తే ఆడుకోరా” అన్నది నిషా. “ఏంటి సీనియర్ మళ్ళీ ర్యాగింగ్ చేస్తున్నాడా?” అని వెనుకనుంచి అజయ్ భుజం మీద చేతులు వేసి అడిగాడు ఒక సీనియర్. “అదేమీ లేదు సార్!” అని

నిషా అక్కడనుండి త్వరత్వరగా వెళ్ళిపోయింది. అజయ్ వెనక్కుతిరిగి చుస్తే, అదే సీనియర్ నవ్వుతూ నిలబడి ఉన్నాడు . రెండో రోజు కూడా అజయ్ ని దిగ్విజయంగా ఆడుకున్నారు.

మెల్లగా నిషాతో స్నేహం చిగురించింది. పూలు పూయటానికి కూడా ఎక్కువసేపు పట్టలేదు. త్వరగానే దగ్గరై పోయారు. నిషా హాస్టల్లో ఇంటికి దూరంగా, అజయ్ కి దగ్గరగా ఉండటంతో వీళ్ళ ప్రేమ పరవళ్ళు తొక్కింది. నిషాతో తన ప్రేమని ఒకరోజు చెప్పేయాలి అనే నిర్ణయానికి వచ్చేశాడు. తన చిన్న నాటి మిత్రుడు వేణుతో కలిసి ఆంతరంగిక సమాలోచనల్లో మునిగి పోయాడు.ఎలా చెప్పాలి ? ఎప్పుడు చెప్పాలి ? అన్న తీవ్ర తర్జన భర్జనల మధ్య ఒక నిర్ణయానికి వచ్చేశాడు అజయ్. "ఎలా చెప్తావురా?" అని వేణు అడిగాడు. తరతరాలుగా ,యుగయుగాలుగా ప్రేమలేఖలు ఇవ్వటమనేది ఆనవాయితీగా వస్తున్నది. ఆ దారినే అజయ్ కూడా ఎంచుకున్నాడు.కాగితం ,కలం తీసుకొని కామ్ గా కూర్చొని కసిగా రాయటం మొదలు పెట్టాడు.వేణు ప్రక్కనే కూర్చొని అజయ్ ఏమి రాయబోతున్నాడా అని ఆశ్చర్యంగా చూస్తున్నాడు.....

To me, the thing sweeter than the sugar is your name

To me, the place better than the best place is the path you go

To me, the blueness in the sky is all what you have in your eyes

I curse myself, when I can't express my feelings straight to you

I praise myself, when you just say a word to me

I will be myself, if you are with me, and I will go nuts without you

అని నాలుగు ఇంగ్లీష్ పంక్తులను రాసాడు. "ఎలా ఉందిరా?" అని వేణుని అడిగాడు. వేణు దానిని ఒకటి రెండుసార్లు చదివాడు. "అద్భుతం రా! ఇంత బాగా ఎలా రాసావురా " అని ఆశ్చర్యంతో అడిగాడు. "ఏదోరా అలా వచ్చేసింది" అన్నాడు. " ఆ రాసేదేదో తెలుగులో రాస్తే పోయేది కదా! ఇంకా బాగుండేది" అన్నాడు వేణు. "నువ్వే మార్చి చూడు" అన్నాడు. అలానే మార్చటం మొదలు పెట్టాడు వేణు. మొదటి రెండు లైన్లు మార్చే సరికి వేణుకి అర్ధం అయింది, అది తెలుగు సినిమా పాటని, దానినే అజయ్ తెలివిగా ఆంగ్లంలోకి మార్చి రాశాడని. "నువ్వు కేకరా! బొమ్మరిల్లు సినిమాలో పాటని ఇంగ్లీష్ లోకి రాసి సొంత కవిత్వంగా షో చేశావు" అన్నాడు వేణు

నవ్వుతూ. "మరి ! క్వశ్చన్ పేపర్ ను పైనుండి కిందకు నాలుగు సార్లు రాసి, అదే సమాధానం అని నమ్మించి మార్కులు తెచ్చుకోగా లేనిది, ఈ ప్రేమలేఖ ఓ లెక్కా" అన్నాడు కాలర్ ఎగరేస్తూ.

ఆ తర్వాత రోజు కాలేజీ లైబ్రరీకీ వెళ్ళాడు అజయ్. అప్పటికే నిషా అజయ్ కోసం ఎదురు చూస్తున్నది. ఇద్దరూ కలిసి లోపలికెళ్ళారు. "ఏంటి రమ్మన్నావు? అన్నది. "నీకో విషయం చెప్పాలి" అన్నాడు అజయ్. ఏంటో చెప్పు అన్నట్టు నిషా అజయ్ వైపు ఆతృతగా చూసింది . తనకు కూడా అర్థం అయింది అజయ్ ఏమి చెప్పాలనుకున్నాడో. "నీకో విషయం తెలుసా" అన్నాడు. "ఏంటి ఏంటి" అన్నట్టు కళ్ళెగరేసింది నిషా . లైబ్రరీ కావటంతో అంతా నిశ్శబ్దంగా ఉన్నది.

చీమ చిటుక్కుమన్నా, దోమ కుటుక్కుమన్నా వినిపిస్తుంది. చుట్టూ ఎవ్వరూ లేరని నిర్ధారించుకున్నాడు అజయ్. దూరంగా లైబ్రేరియన్ ఆ రోజుటి దిన పత్రిక చదువుకుంటున్నాడు. గాలి తక్కువ సౌండ్ ఎక్కువ ఫ్యాన్ గిర్రున తిరుగుతున్నది. "నిషా... అమ్మాయిలలో పది శాతం అప్సరసలుంటారు, ఇరవై శాతం అందమైన అమ్మాయి లుంటారు, మిగిలిన వాళ్ళు అంతా తాము ఆ ఇరవై శాతం లో ఉన్నామనుకుంటారు, నీతో సహా!" అనటంతో నిషా ముఖం లో రంగులు మారాయి. " కానీ నువ్వు మొదటి పది శాతం లో ఉంటావు ,యు ఆర్ ఎన్ ఏంజిల్" అనటంతో నిషా సిగ్గుపడింది. "అయితే ఏంటి ఇప్పుడు ?" అన్నది నిషా . "నీకోసం ఒకటి తెచ్చాను" అన్నాడు. ఏంటి అన్నట్టు మళ్ళీ కళ్ళెగరేసింది నవ్వుతూ. తన చేతిలో ఉన్న పుస్తకంలో నుంచి తాను రాసుకున్న కవిత ఉన్న కాగితం తీసి నిషా చేతికి ఇచ్చాడు. నిషా ఆతృతగా దానిని చూసి అర్థం అయ్యేవరకు చదివింది. సిగ్గుపడుతూ ఆ కాగితం తన పుస్తకంలో పెట్టేసుకొని అక్కడి నుండి వెళ్ళిపోయింది. ఈ విధంగా వీళ్ళ ప్రేమ పట్టాలెక్కేసింది.

ఇంజనీరింగ్ అయిపోయాక చెరొక అంతర్జాతీయ సంస్థలో ఉద్యోగం దొరికింది. దానితో హైటెక్ సిటీ కేంద్రంగా తమ ప్రేమ కార్యకలాపాలను కొనసాగించారు.శని,ఆదివారాలలో వీళ్ళు తిరగని మాల్ లేదు, చూడని హాల్ లేదు.

ఎక్కువ పని చేస్తే, ఎక్కువ డబ్బులు వస్తాయో రావో కాని ఎక్కువ జబ్బులు రావటం మాత్రం ఖాయం.అందుకే ఈ సాఫ్ట్వేళ్ళకు ఎప్పుడూ ఏదో ఒక సమస్యతో బాధపడుతూ ఉంటారు పాపం. కొంతమంది అయితే విచిత్రంగా సమస్యలను వెతుక్కొని మరీ బాధపడుతుంటారు. వీళల్లో

చాలామందికి చికాకెక్కువ, సహనం తక్కువ,అజయ్ తో సహా. ఆఫీసులో వాళ్ళు ఎన్ని యోగా తరగతులు పెట్టినా వీళ్ళ రోగాలు తగ్గవు.

మానేజరు గొడవతో మనస్సు బాగోక, అనుకున్నట్టుగానే అద్దంకి పయనం అయ్యాడు. తాను అరగంట ముందుగా వస్తే తన బస్సు రావాల్సిన సమయానికన్నా గంట ఆలస్యం అని చెప్పటంతో, చేసేది ఏమి లేక, వచ్చి పోయే బస్సులను లెక్కేస్తూ నిలబడ్డాడు. “బస్ స్టాప్ లోనే ఉన్నా డాడీ! బస్సు గంట ఆలస్యం అట, అది వచ్చాక చేస్తాను” అని ఫోనులో మాట్లాడుతున్న ఒక అందమైన అమ్మాయి అజయ్ కంట పడింది. ఆసక్తిగా అజయ్ ఒక చెవి అటు వైపు వేసాడు. “ఏ విషయం మెయిల్ చేస్తామని చెప్పాడు. నేనైతే బాగానే చేశాను” అని వినపడింది. ఇంజనీరింగ్ అయిపోయి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నదన్న విషయం అర్థమైంది అజయ్ కి. “ఉద్యోగం వచ్చేదాకా, అది రాలేదన్న బాధ మాత్రమే ఉంటుంది. వచ్చాక అస్సలు బాధలు మొదలవుతాయి” అని మనసులో అనుకున్నాడు అజయ్.

[తరువాయి భాగం వచ్చే వారం]

★

— మీ స్పందన తెలియజేయండి —

For Latest Telugu Books - Visit now:
Kinige
.com